
# రుణమాఫీపై కాంగ్రెస్ కొర్రీలు

## చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్, ఆగస్టు21: రైతులందరికీ రుణ మాఫీ చేస్తామని ఎన్నికల ముందు ఓట్ల కోసం మాయ మాటలు చెప్పి.. మాఫీ చేసేటప్పుడు కొర్రీలు పెడుతున్నదని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మొయినాబాద్ మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో బుధవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించి రుణమాఫీ కాని రైతుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. రుణమాఫీ విషయంలో చేపట్టిన సంతకాల సేకరణకు రైతుల నుంచి స్పందన లభించింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చేవెళ్ల ఎంపీ మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి రైతులకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు భరోసా కింద ప్రతి రైతుకు ఎకరానికి రూ.15వేలు, రైతు కూలీకి 12500 ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం తప్పనిసరిగా అన్ని నెరవేర్చాలని అన్నారు. అదే విధంగా ధాన్యానికి క్వింటాల్‌కు రూ.5వందల బోనస్ చెల్లించాలన్నారు. రైతులను మోసం చేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామన్నారు. కార్యక్రమంలో జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు బి.పాపయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర నాయకుడు కంజర్ల ప్రకాశ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.అంజయ్య యాదవ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎస్.ప్రభాకర్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి నర్సింహారెడ్డి, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, యువమోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి గణేశ్, యువమోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి రాజమేల్లేశ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు లక్ష్మీపతియాదవ్, జిల్లా నాయకులు పి ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, ఆలూరి జైపాల్‌రెడ్డి, కిసాన్ మోర్చా మండల కార్యదర్శి వీరేశం, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, సురేందర్, బస్వరాజ్, నవీన్, ప్రవీణ్, సత్తయ్య, రైతులు పాల్గొన్నారు.



## పండ్ల మార్కెట్‌ను త్వరగా పూర్తి చేయాలి

### సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ప్రగతి ఫ్రూట్స్ కమిషన్ ఏజెంట్స్ అసోసియేషన్ సభ్యులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 21 : కొహెడ పండ్ల మార్కెట్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రగతి ఫ్రూట్స్ కమిషన్ ఏజెంట్స్ అసోసియేషన్ సభ్యులు బుధవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. అందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, మార్కెట్ నిర్మాణ పనులకు త్వరగా పూర్తి చేస్తామని హామీనిచ్చారని తెలిపారు. మార్కెట్ నిర్మాణ పనుల విషయంపై అధికారులతో చర్చించడం జరిగిందని తెలిపారన్నారు. వారి వెంట ప్రగతి ఫ్రూట్స్ కమిషన్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జిన్నం వెంకటేశ్వర్లుగుప్తా, ప్రధానకార్యదర్శి నర్సింహాగౌడ్, ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ గౌడ్, సుధాకర్, వీరేశ్, కోశాధికారి అనిల్‌కుమార్, నాయకులు మహ్మద్ తాజ్‌బాయి, మహేశ్‌గౌడ్, సభ్యులు ఉన్నారు.

## ఏవోగా వాణి బాధ్యతల స్వీకరణ



నందిగామ, ఆగస్టు 21 : రాజేంద్రనగర్ సాయిల్ టెస్టింగ్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వాణి నందిగామ మండల వ్యవసాయ శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుణమాఫీ కాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నందిగామ, మామిడిపల్లిలోని రైతు వేదికలో ఏవో, ఏఈవోలను సంప్రదించాలని, అర్హులైన ప్రతి రైతు ప్రభుత్వ రుణాలు మాఫీ చేస్తుందని తెలిపారు. వ్యవసాయంపై రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్నా సలహాలు సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

## ఎల్‌వోసి అందజేత



ఆదిబట్ల, ఆగస్టు 21: అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందుతున్న ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగళ్‌పల్లి పటేల్‌గూడ గ్రామానికి చెందిన కొత్త వెంకటేశ్‌గౌడ్‌కు వైద్యం కోసం రూ.ఒక లక్షా 50వేల ఎల్‌వోసీ బుధవారం ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి వర్యులు కొమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో ఎల్‌వోసీ మంజూరైనట్లు తెలిపారు.

## ఓటరు జాబితాలో సవరణకు చర్యలు



కొత్తూరు, ఆగస్టు 21: మండలంలో బూత్ లెవల్ ఆఫీసర్ల సమావేశాన్ని బుధవారం తహసీల్దార్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్-2025 కోసం మండలంలో ఇంటింటికీ ఓటర్ ధ్రువీకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. కలెక్టర్, ఆర్డీవో ఆదేశాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. ఈ కార్యక్రమం రెండు నెలల పాటు కొనసాగుతుందని వివరించారు. ఓటర్ లిస్టులో తప్పులను సవరిస్తామని అన్నారు. అలాగే చనిపోయిన వారి పేర్లను తొలగిస్తామని చెప్పారు. కొత్తగా 18 ఏండ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పిస్తామని వివరించారు.

## రెండోరోజు కొనసాగిన ఫీవర్ సర్వే




కొత్తూరు, ఆగస్టు 21: మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌లో రెండో రోజు ఫీవర్ సర్వే కొనసాగింది. మండల వైద్యాధికారి హరికిషన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ ఫీవర్ సర్వే రెండో రోజు బుధవారం కొనసాగింది. సర్వేలో భాగంగా 8 మందికి డెంగ్యూ పరీక్ష నిర్వహించగా, నెగెటీవ్‌గా నిర్ధారించారు. కార్యక్రమంలో ఉదయ్‌కిరణ్, సీహెచ్‌వో నగేశ్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

## పీఆర్టీయూఎస్ మండల కార్యవర్గం ఎన్నిక



మొయినాబాద్, ఆగస్టు21: పీఆర్టీయూఎస్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. పీఆర్టీయూఎస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి గోవర్ధన్‌యాదవ్ సమక్షంలో పీఆర్టీయూఎస్ కమిటీ మండల అధ్యక్షుడిగా బందయ్య, ప్రధానకార్యదర్శిగా ఎం.నరేందర్‌రెడ్డిను ఎన్నుకున్నారు. అదే విధంగా మండల అసోసియేట్ అధ్యక్షుడిగా రాములు(నాగిరెడ్డిగూడ), మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా మంజుల(ప్రేమంగళారం), మహిళా కమిటీ కార్యదర్శిగా విజయ్‌బాయి(ముర్తుజాగూడ), కార్యదర్శిగా మహేందర్(చిలుకూరు) నియామకమయ్యారు. ఎన్నికల అధికారిగా శేరిలింగంపల్లి మండల పీఆర్టీయూఎస్ అధ్యక్షుడు హనుమంత్ నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పత్రికా సంపాదకవర్గ సభ్యుడు కృష్ణారెడ్డి, పీఆర్‌టీయూఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, సంఘం నాయకులు నరేందర్, యాదగిరి, సంజీవ్‌కుమార్, బీమ్లానాయక్, లక్ష్మణ్, జగ్గయ్య, ఆంజనేయులు, వెంకటయ్య, రాములు, కృష్ణ, మంజుల, వినోద్‌కుమార్, రాములు గౌడ్, నారాయణగౌడ్, శ్రీనివాస్, రవినాయక్, ఉదయశ్రీ, సులోచన, విజయ్‌బాయి, శ్రీలత పాల్గొన్నారు.

## అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు



ఆమనగల్లు/ కడ్తాల్, ఆగస్టు 21: అక్రమంగా మద్యం, గుట్కాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఆమనగల్లు, కడ్తాల్ మండలాల సీఐలు ప్రమోద్‌కుమార్, శివప్రసాద్ హెచ్చరించారు. షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా, ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లోని కిరాణా షాపులు, దాబాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. రెండు మండలాల్లో కలిపి ఏడు మద్యం, రెండు గుట్కా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అక్రమంగా మద్యం, గుట్కాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫాంహౌస్‌లు, రిసార్టుల్లో మద్యం సేవించడానికి ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని లేకపోతే యజమానులపై కేసులు తప్పవన్నారు. కార్యక్రమంలో సీఐలు విజయ్‌కుమార్, సత్యనారాయణ, ఎస్ఐలు వరప్రసాద్, కృష్ణయ్య, శ్రీకాంత్, ఏఎస్ఐ ప్రసాద్‌జీ, సిబ్బంది పాల్గొన్నారు.

# హోటళ్లలో శుభ్రతను పాటించాలి



పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి కృష్ణయ్య

చేవెళ్లటౌన్, ఆగస్టు 21: ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని హోటళ్లలో శుభ్రతను పాటించాలని చేవెళ్ల గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు, చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో హోటల్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోటళ్లకు వచ్చే ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకుని పరిశుభ్రతను పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే హోటల్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు అండర్ డ్రైనేజీలు లేదా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్, ఎంపీవో విఠలేశ్వర్‌జీ, వెటర్నరీ వైద్యుడు తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆర్.రాఘవేందర్, హోటల్ యజమానులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రంగారెడ్డికి పూలమొక్కను అందజేస్తున్న కళాశాల అధ్యాపకులు

## డిగ్రీ కళాశాల భవనం వెంటనే ప్రారంభించాలి

### ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన అధ్యాపకులు

ఇబ్రహీంపట్నంరూరల్, ఆగస్టు 21 : ఇబ్రహీంపట్నంలో నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం వెంటనే ప్రారంభించాలని కోరుతూ.. బుధవారం కళాశాల అధ్యాపకులు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. చాలిచాలని తరగతి గదులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నందున కళాశాల భవనం వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రంగారెడ్డి కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి వెంటనే కళాశాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చొరువ చూపాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

## రా రైస్ మిల్లర్స్ సంఘం అధ్యక్షుడిగా సతీశ్‌కుమార్‌గుప్తా

కొత్తూరు, ఆగస్టు 21: రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వకు చెందిన సతీశ్‌కుమార్‌గుప్తా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో రంగారెడ్డి జిల్లా కార్యవర్గాన్ని నియమించారు. రాష్ట్ర అధ్యక్షుడు గణపతిరెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం జరిగింది. కమిటీ ప్రధానకార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా విష్ణువర్ధన్, ఉపాధ్యక్షులుగా శ్రవణ్‌కుమార్, జనార్దన్‌రెడ్డి, రంజిత్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా ప్రకాశ్, బుచ్చిలింగం, యాదయ్య, సంయుక్త కార్యదర్శిగా రాజశేఖర్ ఎన్నికయ్యారు.

## మున్సిపాలిటీలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

షాద్‌నగర్‌టౌన్, ఆగస్టు 21: ఎల్ఆర్ఎస్ 2020పై షాద్‌నగర్ మున్సిపాలిటీలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఆర్ఎస్‌పై ఏవైనా సమస్యలు ఉంటే హెల్ప్‌డెస్క్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎల్ఆర్ఎస్ సమస్య పరిష్కారానికై టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్ 9912789197, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మేఘన 7995020423, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ దినేష్ 9346812319, ఆపరేటర్ మంజుల 9951326990 సెల్‌నంబర్లలో సంప్రదించాలన్నారు. ఎల్ఆర్ఎస్‌పై ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మాటమార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

ఇబ్రహీంపట్నంరూరల్, ఆగస్టు 21 : రైతులందరికీ రుణమాఫీ చేస్తామని మాటలు పలికిన రేవంత్‌రెడ్డి సర్కారు మాటమార్చటం సరైంది కాదని బీఆర్ఎస్ నేత ఎం. అంజిరెడ్డి బుధవారం డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు కోతలతో కూడిన రుణమాఫీ చేయటం సరైంది కాదని హెచ్చరించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గురువారం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. రైతులందరూ అధిక సంఖ్యలో హాజరై కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ఆయన కోరారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

కడ్తాల్, ఆగస్టు 21: మండల పరిధిలోని కడ్తాల్ గ్రామానికి చెందిన తల్లోజు బాలచారి అనారోగ్యంతో మృతి చెందగా, మృతదేహానికి మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మినర్సింహారెడ్డి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశాడు. అనంతరం ఇటీవలే అనారోగ్యానికి గురైన గురిగిళ్ల పెంటయ్యను పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 5వేలు అందజేశాడు. ఆయన వెంట మాజీ సర్పంచ్ వేణుగోపాల్, రైతు సంఘం సమితి గ్రామ కో ఆర్డినేటర్ మంగల్‌పల్లి నర్సింహ, నాయకులు లాయక్‌అలీ, యాదయ్యాచారి, గురిగిళ్ల రామచంద్రయ్య, తల్లోజు వేణు, ఇర్షాద్, కృష్ణ, మహేశ్, శ్రీశైలం, శ్రీకాంత్, కృష్ణ పాల్గొన్నారు.

## రైలు కిందపడి వ్యక్తి మృతి

కొత్తూరు, ఆగస్టు 21: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో జరిగింది. రైల్వే కానిస్టేబుల్ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. బుధవారం 40 నుంచి 45 ఏండ్ల వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. మృతదేహం గుర్తుపట్టనంతగా నుజ్జునుజ్జుకావడంతో ఎలాంటి ఆధారాలు లభించలేదు. తిమ్మాపూర్ స్టేషన్ మాస్టర్ రహమత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానలో మార్చురీలో భద్రపర్చారు. మృతుడి వివరాలు తెలిస్తే 9848090426లో సంప్రదించాలని సూచించారు.

### రోడ్డు ప్రమాదంలో మరొకరు..

నందిగామ, ఆగస్టు 21 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన నందిగామ బైపాల్ రోడ్డుపై మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం లిబ్యాతండాకు చెందిన నేనావత్ చందు(47) తన బైకుపై భార్యతో కలిసి నందిగామ మండలంలోని దన్‌సింగ్‌తండాకు వచ్చి రాఖీ కట్టి వెళుతుండగా బైపాస్ రోడ్డులో కంటైనర్ లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నందిగామ ఎస్ఐ గోపాల కృష్ణ తెలిపారు.

## డ్రగ్స్‌కు బానిస కావొద్దు..



కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

చేవెళ్లటౌన్, ఆగస్టు 21: విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ సూచించారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని శ్రీ చైతన్య కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత మానసిక బలహీనత వల్ల మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతారని, ఆ తరువాత ఒక వ్యసనంగా మారుతుందని తెలిపారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదుగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్, యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

## అలుగుపారిన మాసబ్ చెరువు



తుర్కయాంజాల్, ఆగస్టు 21: వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో తుర్కయాంజాల్ మాసబ్ చెరువు పూర్తిగా నిండి జలకళను సంతరించుకున్నది. మంగళవారం రాత్రి రెండు గంటల పాటు భారీగా కురిసిన వర్షానికి మాసబ్ చెరువు అలుగు పారుతుండడంతో మాసబ్ చెరువు కాలువ నుంచి నీరు కింద ప్రాంతాలకు ప్రవహిస్తున్నది.

## ఘన సన్మానం



అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘానికి బుధవారం విచ్చేసిన టీఎస్ క్యాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యను సహకార సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్‌యాదవ్ సంఘం సిబ్బందితో కలిసి శాలువాతో సన్మానించారు. వారితో పాటు మేనేజర్ రాకేశ్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

- అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 21



మేడికుంటకు మరమ్మతు పనులు చేయిస్తున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మినర్సింహారెడ్డి

## చెరువులు, కుంటలను పర్యవేక్షించాలి

కడ్తాల్, ఆగస్టు 21: మండల కేంద్రంలో కురుస్తున్న వానలకు చెరువులు, కుంటల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుందని, అధికారులు ఎప్పటికప్పుడు వాటిని పర్యవేక్షించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. కడ్తాల్ పట్టణంలో రెండు రోజులపాటు కురిసిన వానలకు మేడికుంటకు గండి పడింది. రైతుల ద్వారా సమాచారం తెలుసుకున్న లక్ష్మీనర్సింహారెడ్డి బుధవారం మేడికుంటను స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించి, జేసీబీ సహాయంతో గండి పడిన స్థలంలో తాత్కాలిక మరమ్మతు పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలం సీజన్‌కు ముందే ఇరిగేషన్ అధికారులు చెరువులను పరిశీలించి, భద్రత చర్యలు చేపట్టి ఉంటే ఇలాంటి ఘటనలు జరుగకుండా ఉండేదని తెలిపారు. ఇరిగేషన్ ఉన్నతాధికారులు మేడికుంటను పరిశీలించి, మరమ్మతు పనులను పూర్తి స్థాయిలో చేపట్టాలని పేర్కొన్నారు. చెరువులు, కుంటలు నిండుగా ఉంటేనే వ్యవసాయం బాగుంటుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పూడికతీతతో భూగర్భ జలాలు పెరిగాయని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు రామచంద్రయ్య, జంగయ్య, వెంకటేశ్, రవి, మహేశ్, పురుషోత్తం, శ్రీను, శ్రీకాంత్, శ్రీశైలం, ఇరిగేషన్ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య, సిబ్బంది నర్సింహ, కృష్ణ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం


చేవెళ్ల రూరల్, ఆగస్టు 21 : వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్‌రూల్స్ పాటించాలని చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం అన్నారు. బుధవారం శంకర్‌పల్లి మున్సిపల్ దొంతాన్‌పల్లి పరిధి ఐబీఎస్ (ఇండియన్ బిజినెస్ స్కూల్) వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడపరాదని, ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ రోడ్లు దాటొద్దని తెలిపారు. హెల్మెట్ తప్పకుండా ధరించి వాహనం నడుపాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో చదువాలి



ఇబ్రహీంపట్నంరూరల్, ఆగస్టు 21 : క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని శ్రీదత్త ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పాండురంగారెడ్డి అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం సమీపంలోని శ్రీదత్త ఇంజినీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ గోల్‌సెట్టింగ్ ఆవశ్యకతను వివరించారు. టెక్నాలజీపై సర్టిఫికేషన్ ఇంటర్న్‌షిప్ సాధించటం వలన మల్టీనేషనల్ కంపెనీల్లో మంచి వేతనంతో కూడిన ఉద్యోగావకాశాలు ఉంటాయని ఇండస్ట్రీకి కావాల్సిన నైపుణ్యాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌చైర్మన్ జీఎన్‌వీ వైభవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పరమేశ్వర్‌రావు, అచ్యుతరావు, రమేశ్ పాల్గొన్నారు.

## ఎంఈవోగా శంకర్ బాధ్యతల స్వీకరణ



మొయినాబాద్, ఆగస్టు 21 : మొయినాబాద్ మండల విద్యాధికారిగా శంకర్ బాధ్యతలు చేపట్టారు. ఫరూఖ్‌నగర్ మండలం నుంచి మొయినాబాద్ ఎంఈవోగా బదిలీపై వచ్చిన ఆయన బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంధ్య ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించారు. అజీజ్‌నగర్ జిల్లా పరిషత్‌కు 2009లో ప్రధానోపాధ్యాయుడిగా వచ్చిన వెంకటయ్య 2010 నుంచి మండల ఇన్‌చార్జి విద్యాధికారిగా కొనసాగాడు. ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలో భాగంగా ఫరూఖ్‌నగర్ మండలం నుంచి శంకర్ మొయినాబాద్ మండల పూర్తి స్థాయి విద్యాధికారిగా బదిలీపై వచ్చారు. వెంకటయ్య బాధ్యతలు శంకర్‌కు అప్పగించడంతో బాధ్యతలు చేపట్టి విధుల్లో చేరాడు. ఇన్‌చార్జి ఎంఈవోగా ఉన్న వెంకటయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది అతడిని సన్మానించారు.

# నిషేధిత జాబితా నుంచి తొలగించాలని వినూత్న నిరసన

### ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయంలో ఓ యువకుడి హల్‌చల్..



ఇబ్రహీంపట్నం, ఆగస్ట్ 21 : తన భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ఓ యువకుడు బుధవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయంలో తలక్రిందులుగా నిలుచుని వినూత్న నిరసన తెలిపాడు. కార్యాలయంలో తహసీల్దార్, ఇతర సిబ్బంది చూస్తుండగానే సాయంత్రం 5గంటల సమయంలో నిరసన తెలుపుతూ.. యువకుడు హల్‌చల్ చేశాడు. ఇబ్రహీంపట్నం మండలంలోని మంగల్‌పల్లి గ్రామానికి చెందిన ఉల్లింతల జీవన్ బీటెక్ వరకు చదువుకున్నాడు. తనతల్లి ఉల్లింతల జయసుధ పేరుమీద ఒక ఎకరం భూమి ఉంది. బీటెక్ చదివినా ఉద్యోగం రాకపోవటంతో ఎకరం భూమిలో కొంతభాగాన్ని అమ్ముకుని ఏదైనా వ్యాపారం చేయాలనుకున్నాడు. కానీ, మంగల్‌పల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 374లో ఉల్లింతల జయసుధ ఒక ఎకరంతో పాటు మరో రైతుకు సంబంధించి ఇదే సర్వేనెంబర్‌లో ఒక ఎకరం సీలింగ్ భూమి ఉంది. ఆ సీలింగ్ భూమిని దృష్టిలో ఉంచుకుని పట్టాభూమిని సైతం నిషేధిత జాబితాలో చేర్చారు. ఈ విషయం తెలుసుకున్న ఉల్లింతల జీవన్ గత సంవత్సర కాలంగా అధికారుల చుట్టూ తిరుగుతూ..తన భూమి పట్టా అయినప్పటికీ అధికారులు పూర్తిగా తెలుసుకోకుండా నిషేదిత జాబితాలో చేర్చారని, ఈ జాబితా నుంచి తొలగించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. అయినా అధికారులు ఎవరూ స్పందించకపోవటంతో వినూత్నంగా నిరసన తెలిపినట్టు జీవన్ తెలిపారు. ఈ విషయంపై స్పందించి తహసీల్దార్ సునిత మాట్లాడుతూ..ఈ అంశం తన దృష్టికి ఈ రోజే వచ్చిందని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి నిషేధిత జాబితాలో నుంచి తొలగించటానికి ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆమె తెలిపారు. తహసీల్దార్ హామీతో జీవన్ తన నిరసనను విరమించుకున్నాడు.